సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఐ.టి.డి.ఎ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న పాడేరు, ముంచంగిపుట్టు అనంతగిరి, అరకు, కొయ్యూరు పెట్రోల్ బంక్‌లలో ఐదు సూపర్ వైజర్ కమ్ అకౌంటెంట్ పోస్ట్‌లకు సంబంధిత సబ్జెక్టులలో డిగ్రీ (మ్యాథ్స్, కంప్యూటర్, కామర్స్ , ఇంజనీరింగ్) అర్హత కలిగిన అభ్యర్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు డివిజన్ లోకల్ అభ్యర్థుల నుండి తాత్కాలిక పద్దతి లో నియమించుట జరుగుతుందని, ఆసక్తి, అర్హత కలిగిన పాడేరు డివిజన్ స్థానిక అభ్యర్థులు కలెక్టర్ ఆఫీస్ లో గల డిఎం సివిల్ సప్లయిస్ ఆఫీస్‌లో సంప్రదించి దరఖాస్తులు పొందాలన్నారు. పూర్తి చేసిన ధరఖాస్తులు ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు సివిల్ సప్లయిస్ కార్యాలయంలో నేరుగా లేదా పోస్టు ద్వారా అందజేయాలని కలెక్టర్ కోరారు. పోస్టుల భర్తీ పూర్తిగా ప్రతిభ ఆధారంగా, పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎటువంటి ప్రలోభాలకు లొంగవద్దని, మద్యవర్తులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ సూచించారు.

మన్యంలో భారీ వర్షం

- విరిగిపడిన చెట్ల కొమ్మలు- విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరులో కురుస్తున్న వర్షం

హుకుంపేటలో విరిగిన చెట్ల కొమ్మలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఉదయమంతా ఎండ... మధ్యాహ్నమైతే వర్షం ఇలా.. గత కొద్ది రోజులుగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో కొనసాగుతుంది. శనివారం కూడా పాడేరులో వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. పాడేరులో ఉదయం నుంచి ఎండ తీవ్రత నెలకొంది. ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత మొదలై సాయంత్రం 3 గంటల వరకు కొనసాగింది. ఎండ తీవ్రతకు భయపడి మధ్యాహ్న వేళల్లో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జనం భయపడుతున్నారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని గంటకు పైగా వర్షం కురిసింది. దీంతో ఎండ దాటికి అల్లాడిపోతున్న ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. రోడ్డు పక్కన చెట్ల కొమ్మలు పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఐదు గంటలసేపు కరెంటు సరఫరా నిలిచి పోయింది.

జిమాడుగుల: మండల కేంద్రంలో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులు, వడగళ్లతో కూడిన వర్షం పడింది. సుమారు మూడు గంటలసేపు కురిసిన ఈ వర్షంతో వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో రోడ్డు సరిగ్గా కనిపించక పోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపో యాయి. చిన్న కాలువల సైతం పొంగి పొర్లాయి. కొద్ది రోజుల క్రితం నుండి ఏజెన్సీలో వింత వాతావరణం నెలకొంటుంది. ఉదయం వేళ చలి, మధ్యాహ్న సమయంలో ఎండ, సాయంత్రం వేళ తీవ్ర వర్షాలు పడుతున్నాయి.

రక్తదాన దాతలకు మొక్కలు ఇస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

- ప్రారంభించిన జిల్లా అసిస్టెంట్ కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక మోదమాంబ ప్రైవేట్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మోదమాంబ పాఠశాల వ్యవస్థాపకులు కీర్తిశేషులు మూర్తి వర్ధంతిని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రెయినీ ఐఏఎస్ అసిస్టెంట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీ వాస్తవ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రక్తదానం చేయడంతో ఎటువంటి వంటి సమస్య లేదని, అపోహలు విడనాడి రక్తం దానం చేసి ప్రాణాపాయంలో ఉన్న వారికీ కాపాడాలని యువతకు సూచించారు. అవగాహన కలిగి రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. దివంగత ప్రిన్సిపాల్ మూర్తి సేవలను ఆయన తెలుసుకొని ప్రత్యేకంగా కొనియాడారు. పూర్వ విద్యార్థుల సేవలను అభినందించారు. జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ సేవలను విస్తరింపజేసేందుకు కృషి చేస్తామని ఈ సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ సభ్యులు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. రక్తం దానం చేసిన యువకులకు జామ మొక్కలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం ఈ పాఠశాల ప్రాంగణంలోలో మొక్కలు నాటారు. పాఠశాల సిబ్బంది ఆయనను సత్కరించారు. ఈ రక్తదాన శిబిరంలో రక్తదాతలు 83 యూనిట్లు రక్తాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, సభ్యులు జయ, లోహితస్, సూర్యారావు, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో

గిరిజన సంఘం నేత గృహ నిర్బంధం

ప్రకాశక్తి-రాజవొమ్మంగి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి పర్యటన నేపథ్యంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి, చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబును శనివారం చికిలింత గ్రామంలో ఆయన ఇంటి వద్ద పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మండలంలోని చెరుకుంపాలెం పంచాయతీలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న నేపథ్యంలో శనివారం ఉదయమే సూరిబాబును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానంపై ఆదివాసీలు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేని ఎమ్మెల్యేలు, వైసీపీ ప్రజా ప్రతినిధులు అక్రమ అరెస్టులు చేయటం దారుణమన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేదని స్పష్టం చేశారు.

సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష పార్టీల నాయకులు

పోలవరం నిర్వాసితులకు అన్యాయం జరిగితే ఊరుకోం

ప్రజాశక్తి- కూనవరం

కూనవరం పంచాయితీలోని **పోలవరం నిర్వాసితులు ఏ ఒక్కరికీ అన్యాయం జరిగినా, ఎవరి పేరు తీసేసినా ఊరుకొనేది లేదని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు.** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో టిడిపి నాయకులు ఎడవల్లి భాస్కరరావు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. సిపిఎం నాయకులు కొమరం పెంటయ్య మాట్లాడుతూ మండలంలోని నిర్వాసితులకు పేద ప్రజల పక్షాన తమ పార్టీ ఎల్లవేళలా పోరాటం చేస్తుందని తెలిపారు. తక్షణమే ఫిర్యాదుల బాక్స్ తీసివేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు బుజ్జా మోహన్ రావు, కాంగ్రెస్ నాయకులు శ్రీమంతుల వెంకటరమణ, జనసేన నాయకులు నరేంద్ర మాట్లాడుతూ పేద ప్రజలను నిర్వాసితులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెలికాని ఉమా, సూర్యచంద్రరావు, మేకల నాగేశ్వరరావు, శ్రీను, నాగరాజు, కృష్ణ, వీరమల్ల సునీల్, యాలం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు : ఆధార్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్సై రామకృష్ణ అన్నారు. శనవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం మెయిన్ రోడ్‌లో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, సీలేరు దుప్పిలివాడ గ్రామ పంచాయతీ ప్రజలకు ఆధార్ సేవలు పొందే విధంగా ఉన్నత అధికారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆధార్ కార్డు కావాల్సిన వారు సంబంధించిన డాక్యుమెంట్లు వెంట పట్టుకొని రావాలన్నారు. ఉచితంగా ఈ సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డులో పేర్లు, ఇతర మార్పులు చేర్పులు చేసుకోవడానికి చక్కటి అవకాశమని పేర్కొన్నారు. కొత్త కార్డులు కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కాంగ్రెస్ నేతల సంతకాల సేకరణ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి చిన్నస్వామి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర చైర్పర్సన్ పి శాంతకుమారి ఆధ్వర్యంలో ఏజెన్సీ వ్యాప్తంగా సంతకాల సేకరణ చేసి రాష్ట్రపతికు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బి.సులోచన, జగన్నాథం, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున నాయకులు

మోదకొండమ్మ ఉత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. మే 7, 8, 9 తేదీల్లో మోదకొండమ్మ అమ్మవారి జాతర మహెూత్సవములు నిర్వహించాల్సి ఉంది. ముందుగానే ఆలయ ప్రాంగణంలో రంగులు, విద్యుత్ కాంతులతో ముస్తాబు చేస్తున్నారు. వారం రోజుల నుంచి ఆలయ పనులు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అనిల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై దాడి దారుణం

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై వైఎస్ఆర్సిపి శ్రేణులు భౌతిక దాడులకు దిగడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి అన్నారు. రంపచోడవరం మాజీ శాసనసభ్యులు వంతల రాజేశ్వరితో కలిసి శనివారం ఆమె తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో నారా చంద్రబాబు నాయుడు పై జరిగిన దాడిని ఖండించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, నాయకుడు ఏ విధమైన పాత్రను పోషిస్తే .... ఆ పార్టీ శ్రేణులు కూడా ఆ తరహాలోనే ఉంటారని, దీనికి ఈ దాడులే సాక్ష్యం అన్నారు. వైసిపి ప్రభుత్వం దాడులతోనే ప్రజలను భయ బ్రాంతులకు గురి చేస్తోందని ఆమె విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైఎస్ఆర్సిపి ఈ తరహా దాడులకు దిగుతుందన్నారు. పాలన చేతకాక భౌతిక దాడులతో భయం పెంచాలని చూస్తే తెలుగుదేశం చూస్తూ ఊరుకోబోదని ఆమె హెచ్చరించారు. 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే వాళ్ల పై కేసులు పెట్టి వేధించడం, భౌతికదారులు దిగడం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం జడ్పిటిసి కారం శేషమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

ప్రారంభిస్తున్న వైఎస్ ఎంపిపి కొండలరావు

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట: కొట్నపల్లి పంచాయితీ పంది మెట్ట గ్రామంలో తాగునీటి పైప్ లైన్ పనులను హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత యేడాది తాగునీటి సమస్య పై గిరిజన సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో గ్రామం లోని మహిళలు, యువకులతో కలిసి బిందెలు పట్టుకుని ధర్నా చేసి, కలెక్టర్, పీఓలకు వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. దీంతో ఐటీడీఏ ప్రత్యేక నిధులు రూ 3 లక్షల 90 వేను కలెక్టర్, పీఓలు మంజూరు చేశారన్నారు. దీంతో శనివారం పందిమెట్ట గ్రామంలో తాగునీటి పైప్ లైన్ పనులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో కొట్నపల్లి ఎంపీటీసీ సాంబే బాలక్రిష్ణ, గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి తాపుల కష్ణారావు, కిల్లో రామారావు, సీదరి చంద్రబాబు, ముదిలి కైలాష్, సీపీఎం కొట్నపల్లి పంచాయితీ నాయకులు పాంగి కేశవరావు, పాంగి నూకరాజు, వైస్ సర్పంచ్ పాంగి చిన్నబాబు, గ్రామ పెద్ద పాంగి అప్పన్న పాల్గొన్నారు.

సోలార్ లైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: అరకు ఎంపీ గొట్టేటి మాధవి నిధులు రూ.3 లక్షల 40 వేలతో మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనం జంక్షన్, దిగువ కొల్లాపుట్టు గ్రామంలో సోలార్ ఫ్లడ్ లైట్లను మంజూరు చేశారు. వీటిని స్థానిక వైసీపీ మండల అధ్యక్షుడు ఎస్ గోపాల్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ, వీధి దీపాలు లేకపోవడంతో మండల కేంద్రంలోని గిరిజనులు రాకపోకలకు రాత్రుల్లో పల ఇబ బందులు పడుతున్నారన్నారు. ఇటీవల ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె సోలార్ లైట్లు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు కే.సూర్య ప్రకాష్, ఎం.కిరణ్, సుమన్, గ్రామ వాలంటీర్ టీ.కళ్యాణ్, జగదీష్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

లైటును వేస్తున్న యూత్ సభ్యులు

బిజెపి ప్రైవేటీకరణ, మతోన్మాద విధానాలపై పోరాటం

ప్రచార భేరిలో సిపిఎం నాయకులు

చింతూరు మండలం మధుగూరులో ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- చింతూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ, మతోన్మాద విధానాలపై పోరాటం చేస్తామని సిపిఎం నాయకులు సీసం సురేష్ తెలిపారు. మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మండలంలోని మధుగూరు గ్రామంలో సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోడీ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు మోసం చేసిందని విమర్శించారు. మోడీ, అమిత్‌షా జోడీ దేశంలోని రైల్వేలు, పరిశ్రమలు, పోర్టులు, విమానాశ్రయాలు, ప్రభుత్వ స్థలాలను అంబానీ అదానీలకు కట్టబెట్టడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ప్రశ్నిస్తుంటే హిందూ ముస్లింల మధ్య విధ్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విడగొడుతున్నారని తెలిపారు. బిజెపి విధానాలపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కుంజా సీతారామయ్య, కారం సుబ్బారావు, పాండ్రుం సుబ్బారావు, సీతారామయ్య, లక్ష్మి, కారం రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : వామపక్షాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమం శనివారం మండలంలోని గన్నవరం, కృష్ణవరం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఐ వెంకటేశ్వర్లు, డేగల మాధవరావు, ఆగిశెట్టి రాము మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు తగ్గించి, ఉపాధి కూలీలకు పని లేకుండా చేసే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. మతం పేరుతో, కులం పేరుతో రాజకీయాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతుందని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు పరిహారంగాని, ఉపాధి కూలీలకు ఇవ్వవలసిన ఉపాధి కూలీ డబ్బులుగానే ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని తెలిపారు. మే 4న చింతూరులో జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విఆర్ పురం : మండలంలోని రామవరం గ్రామ పంచయతీ పరిధి కోప్పల్లి, శబరి, రాయి గూడెం, తెల్లవారి గుంపు గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ప్రతి ఇంటికి కరపత్రాలు పంచుతూ సమస్యలు తెలుసుకన్నారు. ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలకు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు వడ్లది రమేష్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులందరికీ పేకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంజా నాగిరెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు

మండలంలోని మారుమూల గిరిజన గ్రామం ములకనపల్లిలో ప్రచార భేరి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఉపాధి హామీ నాలుగు చెరువులు ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఉపాధి హామీ క్యూబిక్ మీటర్‌కు రేటు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సవలం మారయ్య, కార్యకర్తలు తెల్లం కన్నారావు, నూనె నాగేశ్వరరావు, కిరణ్ కన్నయ్య, నూనె బుజ్జి, నూనె నాగులు, పండ బుచ్చిరాజు పాల్గొన్నారు.

మండలంలోని మారుమూల గ్రామమైన జీడిగుప్పలో సిపిఎం నాయకులు నిర్వహించిన ప్రచార భేరి కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులూ పూనెం సత్యనారాయణ అధ్వర్యంలో నాయకులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడిగొప్ప మాజీ సర్పంచ్ కోట్ల చిన్నారమ్మ, సిపిఎం మండల నాయకులు సత్తిబాబు, నాయకులు కథల కొండారెడ్డి, సోడె మల్లయ్య, ఖాదర్ బాబు, కథల రామిరెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక మండలంలో...

విఆర్. పురం మండలంలో...

లోతేరు వారపు సంతలో ప్రచార భేరి నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

25న బహిరంగ సభ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మతోన్మాద బిజెపి ప్రభుత్వాని గద్దెదించాలని ఈనెల 25న అరకులోయలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో శనివారం లోతేరు వారపు సంతలో ప్రచార బేరి జీపు జాత చేపట్టారు. ఈ ప్రచారాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, మోడీని అధికారం నుండి గద్దెదించి దేశ సంపదను కాపాడాలన్నారు. గిరిజన చట్టాలు, హక్కులు, పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన అటవీ పాలసీ విధానం రద్దు చేయాలని చెప్పారు. రాజ్యాంగంలో కల్పించిన చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను బడా పెట్టుబడిదారులకు కట్ట బెట్టడానికి బిజెపి కుట్ర చేస్తుందని చెప్పారు. స్టీల్ ప్లాంట్, రైల్వే ,పోస్టల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అదాని, అంబానీ లకు కట్టబెట్టడానికి నరేంద్ర మోడీ కుట్ర చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పి.బాలదేవ్, పద్మాపురం ఉప సర్పంచ్ జె.భగత్ రామ్, చొంపి వార్డు సభ్యులు బి కోగేశ్వరరావు, డి.దసరథ్, ధర్మ, లోతేరు పంచాయితీ సీపీఎం నాయకులు బాక లైకోన్, కిల్లో దొబులు ,తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో నివాసముంటున్న చలపక కృష్ణ (36) శనివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణ డిగ్రీ చదువుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం తెల్లవారి జామున తన నివాసంలోని వంట గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణ (ఫైల్‌ఫొటో)

మోతుగూడెం ఎస్ఐపై గంజాయి ఆరోపణలు

ప్రజాశక్తి-మోతుగూడెం

జిల్లాలోని చింతూరు పోలీసు సబ్ డివిజన్ పరిధి మోతుగూడెం పోలీస్ స్టేషన్ ఎస్ఐపై గంజాయి అక్రమ రవాణా విషయంలో ఆరోపణలు వచ్చాయి. మూడు రోజుల క్రితం మోతుగూడెంలో గంజాయి తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆ తర్వాత నిందితులతో ఒప్పందం కుదర్చుకుని ఆ వాహన్నా విడిచిపెట్టారు. అయితే గంజాయి తరలిస్తున్న వాహనాన్ని నెల్లూరులో ఎస్ఈబీ పట్టుకుని విచారించగా ఈ విషయం చెప్పడం జరిగింది. ప్రస్తుతం మోతుగూడెం ఎస్ఐ పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఉన్నతాధికారులు జిల్లా ఎస్పి తుహిన్ సిన్హాను వివరణ కోరగా, విచారణ చేపట్టామని, త్వరలో పూర్తి వివరాలు ఇస్తామని చెప్పారు.

ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. స్థానిక మసీదు వద్ద శనివారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పేదలకు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు.

ఉత్సాహంగా ఎస్ఎస్ఎ వార్షికోత్సవం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని పాములవాక గ్రామంలో ఎస్ఎస్ఏ స్కూల్, కాలేజ్ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ జటంశెట్టి సాయికుమార్, పద్మావతి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాతృ వందనం పేరుతో తల్లిదండ్రులకు విద్యార్థుల చేత చేయించిన పూజా వందనం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నర్సీపట్నం కంటి వైద్య నిపుణులు డాక్టర్ మద్దు రమణ, డాక్టర్ ఇందిరా దేవి దంపతులు చిన్నారులను ఆశీర్వదించి క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. విద్యార్థుల నడవడికను ఉపాధ్యాయులు పరిశీలించి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. కోటవురట్ల మండలం వైసిపి మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, టిడిపి మండల నాయకులు వేపల జనార్దన్ మాట్లాడుతూ,ఉన్నత విలువలతో విద్యను అందించడంతోపాటు విద్యార్థులను తల్లిదండ్రులను ప్రోత్సహిస్తూ వందమందికి ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం కల్పించడం ఆనందదాయకం అన్నారు. అనంతరం సీరం రెడ్డి చిన సత్యం సావిత్రి దంపతులను ఘనంగా సన్మానించారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాములవాక గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను అడ్డుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డు కోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.సత్తిబాబు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం కార్మికులకు, ఉపాధి కూలీలకు, రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్మికులతో శనివారం సమావేశమైన సత్తిబాబు మాట్లాడుతూ, కార్మికులకి ఉద్యోగ భద్రత కల్పించి, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని పేర్కొన్నారు. ఈనెల 28న నర్సీపట్నంలో జరిగిన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నర్సీపట్నంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎండల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి -రావికమతం: ఎండలకు ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. మండలంలోని కసుకుంట గ్రామంలో శనివారం ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉదయాన్నే తొందరగా ఉపాధి పనులను ప్రారంభించుకొని ఎండలకు ముందుగా పూర్తిచేసుకోవాలన్నారు. రోజు వారి వేతన కింద రూ.272కు తగిన పని ప్రాతిపదిక ప్రకారం గ్రూపు సభ్యులు పూర్తి చేసుకోవాలన్నారు. మంచినీటి బాటిల్స్ అందరూ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. మజ్జిగ ప్యాకెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్టు సౌకర్యాలను కల్పించాలని పలువురు అధికారుల ఉపాధి కూలీల దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన సర్పంచ్ ఉన్నత స్థాయి అధికారుల దృష్టి తీసుకువెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత వరహాలు పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్ దృష్టికి స్థల వివాదం

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోని అంబేద్కర్ స్థల వివాదంపై అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, పార్టీల నాయకులు శనివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అరకులో తహసిల్దార్ కార్యాలయం కు ఆనుకొని ఉన్న అంబేద్కర్ గిరిజన భవన్ స్థలాన్ని 2008లో గిరిజన భవన్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కుంభ రవిబాబు 10 లక్షలు కేటాయించి అంబేద్కర్ గిరిజన భవన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి శంకుస్థాపన చేసిన విషయం అందరికీ తెలిసిందే.ఆ స్థలంలో ఇప్పుడు అరకులోయ వాయుపుత్ర మోటార్ యూనియన్ నాయకులు పార్కింగ్ చేసుకుంటున్నారన్నారు.. ఈ స్థలం కు సంబంధించి ఇరు వర్గాలకు వాగ్వివాదం జరుగుతుందని, ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని మోటార్ యూనియన్ నాయకులను ఆహ్వానించి చర్చలు జరిపినా ఫలితం లేదన్నారు. అంబేద్కర్ విగ్రహం ఎదురుగా మోటార్ యూనియన్ సభ్యులు వేసిన షెడ్లను తొలగించాలని తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించినా స్పందించకపోవడంతో శనివారం అరకులోయను సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు మాట్లాడుతూ, ఈ స్థలం ను అభివృద్ధి చేయడానికి మంచి ఉద్దేశంతో అప్పట్లో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. త్వరలో ఈ స్థలంలో భవన నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు ఆయన అన్నారు.ఆక్రమించినా శిక్ష ర్హులు అవుతారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధులు సాంబశివరావు, వికాస్, గోవర్ధన్, సంజీవరావు, ప్రశాంత్ కుమార్, లక్ష్మణ్, కొండ, ప్రతాప్, వైసీపీ సీనియర్ నాయకులు భాస్కరరావు, విజయ్ కుమార్, చిన్నారావు, అశోక్, దురియా ఆనంద్ కుమార్, అప్పలరాజు, కొండలరావు, కొములు, సుందర్‌రావు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ కు వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

అదునుచూసి అక్రమ తవ్వకాలు

క్వారీని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో సాలిక మల్లవరం సమీపంలో ఉన్న అటవీ భూములో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు జరిగాయి. ఈ ప్రాంతంలో మళ్లీ రంగురాళ్ల తవ్వకాలు కలకలం సృష్టిస్తోంది. నాలుగు సంవత్సరాల క్రితం ఇక్కడ అక్రమంగా తవ్వకాలు జరగడంతో అటవీశాఖ ఏకంగా ఇక్కడ బేస్ క్యాంపే ఏర్పాటు చేశారు. నిఘా పేరిట ఇద్దరు సిబ్బంది నిత్యం రాత్రి వేళల్లో పహారా కాసేవారు . తవ్వకాలు ప్రత్యేక ప్రణాళికతో జరిగినట్లుగా ఇక్కడ పరిస్థితులు కనబడుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలు జరిగిన సమయంలో ఎవరు అందుబాటులో లేకపోవడం విచిత్రంగా ఉంది. బేస్ క్యాంపులో ఉండాల్సిన సిబ్బంది లేకపోవడం, సంబంధిత అటవీ శాఖ గార్డు ముందు రోజు వరకు విధుల్లో ఉండి శుక్రవారం రాత్రి తిరుపతి వెళ్లి పోవడం, అటవీ శాఖ రేంజర్ లక్ష్మీనరసిం మూడు రోజులుగా సెలవులో వెళ్ళిపోవడం, స్థానిక పోలీస్ స్టేషన్లో అందుబాటులో ఉండాల్సిన ఎస్ఐ నర్సీపట్నంకు డ్యూటీ పై వెళ్లడం తాజాగా జరిగిన తవ్వకాలు పలు అనుమానాలకు తావిస్తుంది. ఇక్కడి అటవీ శాఖ గస్తీ పరిధిలో ఉన్న సారికిమల్లవరం క్వారీలో శుక్రవారం రాత్రి భారీ యంత్రాలతో రంగురాళ్ల తవ్వకాలు చేపట్టిన ఘటన సంచలనం సృష్టించింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నాతవరం మండలం నుంచి రెండు టిప్పర్లు, ఒక జెసిబి క్వారీ ప్రాంతానికి చేరుకొని తెల్లవారుజామున మూడు గంటల వరకు తవ్వకాలు జరిగినట్లుగా స్థానిక జాలర్లు కొంతమంది తెలిపారు. మూడు గంటల ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువైన రంగురాళ్ల మట్టిని వాహనాల్లో తరలించుకుపోయారు. ఈ తవ్వకాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక రంగురాళ్ల వ్యాపారి అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు కొంతమంది మీడియా ప్రతినిధులతో కలిసి పక్కా ప్రణాళిక వేసుకొని ఈ తవ్వకాలను చేపట్టినట్లుగా ఈ ప్రాంతీయంతా చర్చించుకుంటున్నారు. వాస్తవానికి గొలుగొండ మండలం సారిక మల్లవరం సమీపంలో అటవీ శాఖ పరిధిలోని రంగురాళ్ల క్వారీల్లోనే గతంలోనూ రంగురాళ్ల తవ్వకాలు జరిగాయి. అప్పటి నుంచి అటవీశాఖ అధికారులు ఈ క్వారీ సమీపంలో ఓ బేస్ క్యాంప్ ఏర్పాటు చేసింది. గత ఏడాది కూడా ఈ క్వారీకి సమీపంలో భారీ యంత్రాలతో ఇక్కడ తవ్వకాలు చేపట్టారు. అధికారులు స్పందించి బ్బైపిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో కొంత మట్టిని సేకరించారు. తాజాగా అదే క్వారీలో శుక్రవారం రాత్రి జేసీబీ, లారీల్ని ఉపయోగించి తవ్వకాలు చేపట్టి, విలువైన ఆ మట్టిని లారీల్లో తాండవ రిజర్వాయర్కు అనుకుని ఉన్న రోడ్డు ద్వారా గొలుగొండ మండలాన్ని దాటించి ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారు. అందుకోసం శుక్రవారం మధ్యాహ్నమే కొన్ని వాహనాల్ని ఈ ప్రాంతానికి తరలించి, తెల్లార్లూ గుట్టు చప్పుడు కాకుండా తవ్వకాలు సాగించినట్లుగా తెలుస్తోంది. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్న క్వారీలోనే తవ్వకాలు చేపట్టడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పథకం ప్రకారమే తవ్వకాలు :

ఒక పథకం ప్రకారమే ఇక్కడ తవ్వకాలు జరిపినట్టు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి ఇక్కడ అధికారుల నిఘా ఉన్నా ఇదే ప్రాంతంలో రాత్రి వేళ తవ్వకాలు జరపడంపై స్థానికంగా చర్చించుకుంటున్నారు. సదరు క్వారీ వద్ద అటవీశాఖ సిబ్బంది నిత్యం కాపలా ఉంటారు. రాత్రి వేళల్లో ఉన్నతాధికారులు. ఆకస్మిక తనిఖీలకూ వస్తుంటారు. ఇలా ఎలా జరిగిందంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ తవ్వకాల వెనుక కచ్చితంగా అధికారులు ప్రమేయం ఉంటుందనే చెబుతున్నారు. వాస్తవానికి శుక్రవారం రాత్రి గస్తీ సిబ్బంది హాజరు కాలేదు. ఈ ప్రాంత అటవీ శాఖ గార్డ్ ఇందిరా దేవి శుక్రవారం సాయంత్రం వరకు విధుల్లో ఉండి అదే రోజు రాత్రి సెలవు పై తిరుపతి వెళ్లారు. అటవీ రేంజ్ అధికారి కూడా మూడ్రోజులుగా సెలవులో ఉన్నారని ఆ శాఖ సిబ్బందే చెబుతున్నారు. దీంతో ఆయా అనుమానాలు నిజమేనని తెలుస్తోంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో తవ్వకాలేమైనా జరిగితే స్థానికులు పోలీసులు దష్టికి తీసుకువెళు ంటారు. శుక్రవారం రాత్రి తవ్వకాలు జరిగిన సమయానికి గొలుగొండ ఎస్ఐ కూడా స్టేషన్లో లేరని, నర్సీపట్నంలో రాత్రి గస్తీకి వెళ్లినట్టు చెబుతున్నారు. ఇలా అధికారులెవరూ లేని సమయంలో భారీ యంత్రాలతో తవ్వకాలు జరగడం పట్ల పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఎంతమంది అధికారులు ఆ సమయంలో విధుల్లో లేకుండా ఉండడం వెనుక అధికార పార్టీకి చెందిన నేతలు ఒత్తిడే కారణంగా కనిపిస్తుంది. పక్కా వ్యూహం ప్రకారమే తవ్వకాలకు వెళ్లినట్టు తెలుస్తోంది. స్థానిక రంగురాళ్ళ వ్యాపారులతో పాటు కొంతమంది రాజకీయ నాయకులు, విలేకరుల ప్రమేయంతోనే ఈ తవ్వకాలు జరిగినట్టు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

తవ్వకాలు చేపట్టింది ఎవరు?

సారిక మల్లవరం రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు చేపట్టినది స్థానిక వ్యాపారులే అధికార పార్టీకి చెందిన నాయకులు అండదండలతో తవ్వకాలు చేపట్టినట్లు ఈ ప్రాంతీయులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. తవ్వకాలు జరిగిన విధానం ఈ చర్చలకు ఊతమిస్తున్నాయి.

గెలిస్తే అమరావతిని పూర్తి చేస్తా : కెఎ పాల్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: తాను సీఎం అయితే అమరావతిని పూర్తి చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. నర్సీపట్నంలో తన తండ్రిని చూసేందుకు శనివారం వచ్చిన ఆయన తిరుగు మార్గమధ్యలో విలేకరులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని పార్టీలు కలిసి వస్తే స్టీల్ ప్లాంట్ ను కొందామని, స్టీల్ ప్లాంట్ కొనే స్తోమత నా ఒక్కడికే ఉందని అన్నారు. చంద్రబాబు, జగన్ లు పరిపాలనలో ఫెయిలయ్యారని హెద్దేవా చేశారు. తనను సీఎం చేస్తే అమరావతి పూర్తి చేసి రైతులకు బహుమతి ఇస్తానన్నారు. సింగరేణిని కాపాడుకోలేని కెసిఆర్ స్టీల్ ప్లాంట్‌ను ఎలా కొనగలడని ప్రశ్నించారు.

నేతలు, అధికారులపై చర్యలు తీసుకోవాలి

గొలుగొండ:మండలంలో సాలికమల్లవరం రంగురాళ్ల క్వారిలో అక్రమ తవ్వకాలకు అధికార పార్టీ నాయకులు, అటవీ అధికారులే కారణమని జనసేన నర్సీపట్నం నియోజకవర్గం ఇంచార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక శాసనసభ్యులు, అధికార పార్టీ నాయకులు, అటవీశాఖ అధికారులు పోలీసు అధికారులు కుమ్మక్కవడంతోనే తవ్వకాలు జరిగాయన్నారు. జెసిపిని అటవీ శాఖ అధికారులు, పోలీసులు ఇప్పటివరకు ఎందుకు కనుక్కోలేక పోయారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రోజు పహారా కాయాల్సిన అటవీ శాఖ సిబ్బంది శుక్రవారం క్వారి ప్రాంతానికి ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల పార్టీ అధ్యక్షుడు గెడ్డం దొరబాబు , మండలం సీనియర్ నాయకులు రేగుబళ్ళ శివ, వాసు, వెంకటేష్, చిరంజీవి, కొప్పాక కళ్యాణ్, పత్తి సూరిబాబు, వేగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు

ఎస్‌బిఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక కళ్యాణ మండపంలో స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఖాతాదారుల కనెక్ట్ సదస్సును ఏర్పాటు చేశారు. భారతీయ స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నర్సీపట్నం ఆధ్వర్యంలో ఎస్ఎంఈ కనెక్ట్ ఖాతాదారుల సదస్సును బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎంఎ స్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏజీఎం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ స్వరూప్ మాట్లాడుతూ, ఖాతాదారులకు ఎస్ఎంఈ ద్వారా సేవల అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బ్యాంకు ద్వారా ముద్ర లోన్లు కొత్తగా వ్యాపారాలు పెట్టే వారికి, కొత్తగా పెట్రోల్ బంకులు పెట్టే వారికి ఎటువంటి షూరిటీలు లేకుండా లోన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్ బ్యాంకు అందించే స్కీములపై వివరించారు. ఖాతాదారులకు మరెన్నో సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఏఎల్ పురం సచివాలయంలో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజేష్ శనివారం కొత్త మల్లంపేట వద్ద ప్రమాదంలో గాయాలయ్యాయి. కేడీపేట నుండి తన స్వగ్రామమైన డౌనూరు వెళుతుండగా కొత్త మల్లంపేట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాద సమయంలో హెల్మెట్ ఉండడంతో భారీ ప్రమాదం తప్పింది. గాయాల పాలైన ఆయనను ఏ ఎల్ పురం సర్పంచ్ భర్త రమేష్ గోల్కొండ పిహెచ్సికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నంకు అంబులెన్స్ లో తరలించారు.

పిడుగుపడి పాడి గేదె మృతి

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో పాటు పిడుగు పడటంతో పాడి గేదె మరణించింది మాడుగుల అర్బన్ కాలనీ సమీపంలో తూరిబిల్లి కల్లాల వద్ద యాల్ల కొండమ్మకు చెందిన సూలు తో వున్న పాడి గేదె పిడుగు పడడంతో మరణించింది. పాలు సేకరించి జీవనోపాధి పొందుతున్న సదరు కుటుంబం ఈ సంఘటనతో ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రానికి చెందిన న్యాయవాది శ్రీనాథు ప్రసాదరావు తన పెళ్లి రోజు సందర్భంగా పేదలకు శనివారం వస్త్రాలు పంపిణీ చేశారు. ముందుగా స్థానిక సెయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో దుప్పట్లు, నైటీలు పంపిణీ చేశారు. బస్ స్టాండ్ వద్ద ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అప్పలరాజు పురంలోని లలిత వృద్ధాశ్రమంలోని వద్దులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

కోటవురట్లలో 'నువ్వే మా నమ్మకం జగన్'

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనీల్‌కుమార్ జగనన్న సంక్షేమ పథకాల లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

మాట్లాడుతున్న నిర్మల

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మేడే కార్యక్రమాన్ని కార్మికులందరూ ఐక్యంగా విజయవంతం చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.నిర్మల, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు పిలుపునిచ్చారు. శనివారం అడ్డతీగల గ్రామంలో అంగన్వాడీ యూనియన్ మండల ప్రాజెక్టు సమావేశం ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జి బేబిరాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోజురోజుకు అంగన్వాడీలపై అధికార పార్టీ నాయకులు, అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. సమస్యలపై శాంతియుత పోరాటాలు చేస్తున్న వారిపై ప్రభుత్వం నిర్బంధకాండ విధిస్తుందని, నాయకులపై కార్మికులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల మధ్య విభేదాలు సృష్టించే విధంగా కొంతమంది అధికారుల వ్యవహార శైలి ఉందని, దీన్ని కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 24న మినీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కె రాణి, కెవి రామలక్ష్మి, కె వెంకటలక్ష్మి, సిఐటియు మండల నాయకులు సిహెచ్ సుబ్బారావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎపి జెన్‌కో ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో శనివారం ఏపీ జెన్కో హాస్పిటల్‌లో భవ్య హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేశారు. రాజమండ్రి నుండి గౌతమి నేత్రాలయం వైద్య నిపుణులు డాక్టర్ కె. తిరుపతి రోగులకు కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్ కో సిఈ శ్రీధర్, ఎస్ఇ వెంకటేశ్వర్లు, డిఇ బాలకృష్ణ, ఈఈ బాబురావు పాల్గొన్నారు.

విద్యాశాఖ సిబ్బందిపై చర్యలు హేయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పార్వతీపురం మన్యం జిల్లాలో రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో డిఇఒ, వీరఘట్టం ఎంఇఒ, కెజిబివి ప్రిన్సిపల్, జిసిడిఒ అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం హేయమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణిత శాస్త్ర పాఠ్య పుస్తకాన్ని పంపిణీ చెయ్యలేదనే చిన్న కారణంతో సస్పెన్షన్ చేసి ఉపాధ్యాయులపై ఒత్తిడిని తీసుకువచ్చి భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదని తెలిపారు.

ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ వెన్నెముక

కోర్టులు సామాన్యులకు అందుబాటులో ఉండాలి
సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - లీగల్ రిపోర్టర్

ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ వెన్నెముక అని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఉదయం నగరంలోని ఓ హోటల్‌లో కీర్తిశేషులు న్యాయ కోవిదుడు, విశాఖ మాజీ మేయర్ డివి.సుబ్బారావు స్మారకోపన్యాసంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. న్యాయవ్యవస్థ సామాన్యులకు సైతం అందుబాటులో ఉండాలని సూచించారు. సమాజంలో న్యాయవాదులు అంతర్భాగమని, వారిని వేరుగా చూడలేమని అన్నారు. డివి.సుబ్బారావు దేశవ్యాప్తంగా చేసిన ప్రసంగాలు, న్యాయస్థానాల్లో చూపిన చతురత మరిచిపోలేమన్నారు. ప్రజాస్వామ్యం అన్నిటికంటే ఉన్నతమైందని, దానికి విఘాతం కలిగితే న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించే అధికారం ఉందని అన్నారు. భారత రాజ్యాంగంలోని 141, 144 అధికరణాలను ప్రస్తావించారు. ఆయుధాలతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలమా ? అని ప్రశ్నించారు. పార్లమెంటు, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థలతో పాటు న్యాయస్థానాల పరిధిని విశ్లేషించారు. కార్యనిర్వాహక వ్యవహారాల్లో పాలకుల జోక్యం తగదని, అటువంటి సందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం స్పందిస్తుందని అన్నారు. ఇందుకు సంబంధించిన పలు కేసులను వివరించారు. న్యాయవ్యవస్థ సామాన్యుడికి, కార్యనిర్వాహక వ్యవస్థకూ మధ్య వారధి అని పేర్కొన్నారు. పరిపాలన అంశాలలో న్యాయవ్యవస్థ ఎప్పుడూ ప్రజా పక్షమే అని వివరించారు. వివిధ నేరాల్లో జైల్లో మగ్గుతున్న ఖైదీల హక్కుల పరిరక్షణ, వారి జీవన పరిస్థితులు, మానవ హక్కుల పరిరక్షణ వంటి విషయాలపై ప్రభుత్వాలు తమ హద్దులు దాటవద్దన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధుల హక్కుల పరిరక్షణ ప్రభుత్వం బాధ్యతని తెలిపారు. గాలి, నీరు, సూర్యరశ్మి వంటి అంశాలు, కాలుష్యంపై 2050 నాటికి తీవ్ర మార్పులు వచ్చే అవకాశం ఉందని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని. హెచ్చరించారు. పారదర్శకంగా పాలకులు వ్యవహరించాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, డివి సుబ్బారావు కుమారుడు జస్టిస్ డివిఎస్ఎస్.సోమయాజులు, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్న కుమార్, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ మాంధాత సీతారామమూర్తి, జ్యోతిర్మయి, పలువురు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, రాష్ట్ర ఉన్నత విద్య నియంత్రణ కమిటీ సభ్యులు, గాయత్రీ విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లావు నాగశ్వరరావు

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపి పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం విశాఖ జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. 32 మంది ప్రాణదానం, 62 గ్రామాల రైతులు 24 వేల ఎకరాల భూముల త్యాగం, 64 మంది కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పదవీ త్యాగాలతో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆవిర్భవించిందని, దీంతో విశాఖ రూపురేఖలే మారిపోయాయని తీర్మానంలో గుర్తు చేశారు. ప్లాంట్ ఏర్పాటుకు నాటి కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.4980 కోట్లు పెట్టుబడి పెడితే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్టీల్‌ప్లాంట్ ఇంతవరకూ రూ.50 వేల కోట్లును పన్నులు, డివిడెండ్ల రూపంలో కట్టిందని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందని, ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళ, వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం అందిస్తోందని పేర్కొన్నారు. రూ.3 లక్షల కోట్లు విలువైన ప్లాంట్‌ను కారుచౌకగా అమ్మేసే కుట్రలు కొనసాగుతున్నాయని తెలిపారు. కరోనా సమయంలో లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా చేసి దేశంలో వేలాది మంది ప్రాణాలను కాపాడిన సంజీవినిగా ప్లాంట్ నిలిచినట్టు తీర్మానంలో గుర్తు చేశారు. అటువంటి బంగారు బాతును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంద శాతం అమ్మకానికి పెట్టిందని, దీనికి వ్యతిరేకంగా రెండు సంవత్సరాలకుపైగా ఉద్యమం నడుస్తోందని తెలిపారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం ఏదో ఒక విధంగా సంస్థను తనకు అనుకూలురైన కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు సాగిస్తూనే ఉందని, ప్లాంట్‌కు ముడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్, రైల్వే రేక్స్ రాకుండా అడ్డుకుంటోందని పేర్కొన్నారు. ప్లాంట్‌లోని మూడో బ్లాస్ట్ ఫర్నేసును మూత వేసి, కావాలనే నష్టాల ఊబిలోకి నెడుతున్నారని తెలిపారు. సొంత గనులు కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇఒఐ ద్వారా ముడి సరుకు, వర్కింగ్ క్యాపిటల్ సేకరణకు యాజమాన్యం పూనుకుంటే దీనిలో ప్రభుత్వ రంగ సంస్థలు పాల్గొనకుండా కేంద్రం ఆటంకాలు సృష్టిస్తోందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అష్టదిగ్బంధనం చేసి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నిందని తీర్మానంలో తెలిపారు. ఈ కుట్రలను సమావేశం తీవ్రంగా గర్హించింది. ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేసింది.

మాట్లాడుతున్న జగ్గునాయుడు

నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

వెంకయ్య పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

ప్రజాశక్తి - చింతూరు : సిపిఎం నాయకులు కామ్రేడ్ మడకం వెంకయ్య పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని సిపిఎం మండల నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 2005 ఏప్రిల్ 22న ప్రమాదవశాత్తు వెంకయ్య మరణించారని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అమరజీవి కామ్రేడ్ మడకం వెంకయ్య స్వగ్రామైన మండలంలోని గూడూరులో సిపిఎం సభ్యులు, గ్రామస్తులు వెంకయ్య 18వ వర్ధంతిని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సురేష్, శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని పార్టీ నిర్మాణంలో మొదటి తరం నాయకుల్లో కామ్రేడ్ వెంకయ్య ఒకరని తెలిపారు. భక్తుల భీష్మారావు, బండారు చందర్రావు, శ్యామల వెంకటరెడ్డితో కలిసి వెంకయ్య ఈ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ఫారెస్ట్ దోపిడీ, వెట్టి చాకిరిపై ప్రజలను చైతన్యం చేసే దాంట్లో నాయకత్వం వహించారని తెలిపారు. ప్రజలను చైతన్యం చేసే నాయకుడుగా మండల, డివిజన్ నేతగా వెంకయ్య ఎదిగారని తెలిపారు. ఆనాడు ఉమ్మడి మోతుగూడెం పంచాయతీ సర్పంచ్‌గా, చింతూరు మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికై ప్రజా సమస్యలు పరిష్కరించే దాంట్లో ప్రజాప్రతినిధిగా ముందున్నారని చెప్పారు. విద్య, వైద్యం, రోడ్లు, వ్యవసాయ సౌకర్యాలు కల్పించడంలో వెంకయ్య తనకంటూ ప్రత్యేక ముద్ర వేయించుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మడకం రమేష్, ధూబి రమేష్, బాడిశ శేషు, కన్నారావు, రాములమ్మ, సుబ్బలక్ష్మి, సోడే సూరయ్య దూబి రాజేష్, మడకం శ్రీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై 21న జాతీయ సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపితో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 21న విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జాతీయస్థాయి ఆదివాసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ నాయకులు ధర్ముల సురేష్ (ఎపి), ముక్తి సత్యం (తెలంగాణ), కేదార్ సబర్ (ఒడిశా) తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలోని అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి చారిత్రాత్మకమైన అటవీ హక్కుల చట్టం - 2006ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ క్రమంలోనే అటవీ హక్కుల సంరక్షణ చట్టం సవరణ, నియమాలు - 2022ని ముందుకు తెచ్చారని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను, అడవిని పూర్తిగా కార్పొరేట్లకు అప్పజెప్పే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ కుట్ర చేసిందని ఆరోపించారు. ఈ చర్యలతో అటవీ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాదిమంది ఆదివాసీలను వారి ప్రాంతాల నుంచి, జీవనోపాధి నుంచి సమూలంగా దూరం చేయనున్నారన్నారు. ఈ సమస్యలపై చర్చించి తగు పోరాట కార్యక్రమాన్ని రూపొందించడం కోసం జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ మత్స్యకారుల కళంజియ సమాఖ్య సభ్యులు శనివారం ఎర్త్ డే సందర్భంగా కొత్త జాలారిపేట, నావెల్ క్యాంటీన్ ఎదురుగా ఉన్న గంగమ్మ తల్లి గుడి సమీపంలో బీచ్‌ను శుభ్రం చేశారు. వ్యర్థాలను ఏరి, సంచుల్లో వేసి దూర ప్రాంతాలకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ భూమిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో కళంజియ నాయకులు రామయ్య, అయ్యప్ప, ధాన్ ఫౌండేషన్ రీజనల్ కో-ఆర్డినేటర్ శైలజ, రామ్ కుమార్‌తో పాటు, లోకేష్, ధనలక్ష్మి, పృథ్వీ, రజిని తదితరులు పాల్గొన్నారు.